క్లుప్తంగా

నేడు బూత్ కమిటీల సమావేశాలు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం 9 గంటలకు చాగల్లు కాపు కల్యాణ మండపంలో చాగల్లు మండల స్థాయి బూత్ కమిటీల సమావేశం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో టౌన్, కొవ్వూరు మండల పరిధిలో బూత్ కమిటీల సమావేశం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు తాళ్లపూడి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తాళ్లపూడి మండలంలోని బూత్ కమిటీలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ కమిటీ సభ్యులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవంగా పోలమ్మ తల్లి గ్రామోత్సవం



అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల: అనంతపల్లిలో రజకుల ఆరాధ్య దైవం పోలమ్మ తల్లి ఆలయ 45వ వార్షిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళ, తాళాలు, విచిత్ర వేషాధారణలు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి భక్తులు హారతులిచ్చారు. గ్రామంలోని ఉండ్రాళ్ళ చెరువు గట్టున అమ్మవారికి ప్రత్యేక ఆలయం ఏర్పాటు చేసి ఏటా సంక్రాంతి పండగ తర్వాత ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోందని సంఘ పెద్ద తొంటపాక సూర్యారావు, ఏలూరు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈసందర్భంగా బంధువుల రాకతో రజకుల ఇళ్లల్లో సందడి నెలకొంది.

బూత్ కమిటీలు పటిష్టంగా పనిచేయాలి



జగన్నాథపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, సురేష్, నాయకులు

గోపాలపురం: బూత్ కమిటీలు గ్రామాల్లో సమన్వయంతో పనిచేయాలని ఎన్నికల సమయానికి కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు పాటించాలని నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జి ఆచంట సురేష్ అన్నారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో సోమవారం బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, మండల కన్వీనర్ పోలిరెడ్డి నాగరాజు, నాయకులు పఠాన్ అన్సర్‌బాషా, పోశిన శివకేశవ, వంగా మురళీకృష్ణ, చిలకా సతీష్, తిర్నాతి వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయినందున ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని నిబంధనలు అందరూ పాటించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తాళ్లపూడి పీహెచ్‌సీని, పలు కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్ పోస్టర్లు తొలగించాలని అన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ఆయన వెంకట ఆర్ కిషోర్, సిబ్బంది ఉన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన పాతాల సుజన్‌రావు అక్రమంగా సారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. సుజన్‌రావు వద్ద పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

అనధికారికంగా
బీర్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: పట్టణంలో పీఆర్ఆర్ కల్యాణ మండపం రోడ్డులో సోమవారం వేములూరు గ్రామానికి చెందిన కొనగళ్ల వీరాంజనేయులు అనే వ్యక్తి వద్ద 15 బీర్లు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. అనధికారికంగా బీర్లు తరలిస్తుండగా వీరాంజనేయులును అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

నిబంధనల ప్రకారం వ్యవహరించాలి

కడియం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని వేమగిరి, కడియం, కడియపుసారం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో ఎన్నికల కోడల్ అమలు తీరుపై ఆరాతీశారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. రూల్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరించి ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

ప్రతి కార్యకర్త కష్టాన్ని గుర్తిస్తాం



కొవ్వూరులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు



మీనానగరంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను వృద్ధురాలికి అందిస్తున్న ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు

- ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్
- విజయమే లక్ష్యంగా నాయకులంతా సమష్టిగా పనిచేయండి
- ఎమ్మెల్యే తలారి తలారి వెంకట్రావు పిలుపు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడి కష్టాన్ని గుర్తించి భవిష్యత్తులో వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని రాజమహేంద్రవరం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలో ఎస్ఎఫ్ఎస్ కేబుల్ నెట్ వర్క్ ఆఫీసులో నిర్వహించిన సమావేశంలో ఇరువురు మాట్లాడారు. ఎన్నికల తరుణం సమీపించినందున నాయకులు పార్టీ కోసం కష్టించి పనిచేయాలని కోరారు. రానున్న రోజుల్లో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రకటించారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, చాగల్లు, తాళ్లపూడి మండల పార్టీల గౌరవ అధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, సిద్ధంశెట్టి కృష్ణ, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పట్టణ పార్టీ మాజీ కన్వీనర్ మైపాల రాంబాబు, సర్పంచ్‌లు తానేటి కుమారి, తిరిగిపల్లి వెంకట్రావు, మట్టా శ్రీనివాస్, దొమ్మేరు మాజీ సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిడి విజయరావు, నాయకులు తోట రామకృష్ణ, గంధ్రోతు శివరామకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు, వెంపాటి సురేష్, ఉప్పులూరి వెంకట ఫణి కృష్ణారావు(నానాజీ), ఇంటి వీర్రాజు, కౌన్సిలర్ తోట లక్ష్మీప్రసన్న, యాళ్ల నరసింహారావు, కోడూరి సత్యనారాయణ, గంటా చిరంజీవి తదితరలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే అన్ని వర్గాలకూ మేలు

చాగల్లు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం చాగల్లు మండలం మీనానగరంలో గడపగడపకు వైఎస్సార్ సీపీలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీలు మట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిరాజు సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, గూడపాటి శివ, వైఎస్సార్ సీపీ మండల గౌరవధ్యక్షుడు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైస్ ఎంపీపీ జజ్జవరపు రామచంద్రరావు, ఉప సర్పంచ్ మేకా రాజు, బొర్రా రజనీ ప్రసాద్, నాయకులు గంగవరపు రాజేంద్రప్రసాద్, ముప్పిడి విజయరావు గేడా శ్యామ్, వర్ధినేడి చిన బాబు, మద్దుకూరి రవి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ‘పది’ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్‌ను నోటీస్ బోర్డులో చూసుకుంటున్న విద్యార్థులు



తాళ్లపూడి పరీక్ష కేంద్రం వద్ద ఇన్విజిలేటర్ల సూచనలు వింటున్న విద్యార్థులు

దేవరపల్లి: పదవ తరగతి పరీక్షలు దేవరపల్లి మండలంలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో తొమ్మిది జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఆరు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాశారు. మండలంలో 1,013 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా, 948 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎం. తిరుమలదాస్, కేఆర్ఆర్ఎస్ అప్పారావు తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 947 మందిలో 917 మంది పరీక్షకు హాజరయ్యారు. గతంలో పరీక్ష రాసి ఉత్తీర్ణులు కాని విద్యార్థులు 66 మందిలో 31 మంది పరీక్ష రాసినట్లు ఎంఈఓ తారుమలదాస్ తెలిపారు. మొదటి రోజు పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిసి మొత్తం 65 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో 93.6 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా రెగ్యులర్ విద్యార్థులు 96.8 శాతం, సప్లిమెంటరీ విద్యార్థులు 47 శాతం హాజరైనట్టు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోగా, ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష జరిగింది. ప్రధాన ద్వారం వద్ద ఉపాధ్యాయులు విద్యార్థులను తనిఖీ చేసి పంపించారు. విద్యార్థులు పరీక్షరాసి బయటకు వచ్చే వరకు తల్లిదండ్రులు కేంద్రాల వద్ద వేసి ఉన్నారు.

గోపాలపురం మండలంలో..

గోపాలపురం: మండలంలో టెన్త్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి జి శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 1,021 మంది విద్యార్థులకు 866 మంది పరీక్షలకు హాజరు కాగా 150 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. రాజంపాలెం, దొండపూడి, వేళ్లచింతలగూడెం, గోపాలపురం, గోపాలపురం బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ చెప్పారు.

153 మంది విద్యార్థులు గైర్హాజరు

నల్లజర్ల: మండలం పరిధిలోని ఏడు సెంటర్లలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలుగు పరీక్షకు 1,208 మంది హాజరుకావాల్సి ఉండగా 1,055 మంది హాజరయ్యారు. అన్ని సెంటర్లలో మొత్తం 153 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతి తెలిపారు.

పరీక్ష రాసిన 638 మంది విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 716 మంది విద్యార్థులకు 638 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరైనట్టు ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. 78 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. చీఫ్ ఎగ్జామినర్లుగా సీహెచ్ నాగేంద్రరావు, శ్రీ వాసవి, పి విజయకుమార్, సుబ్బలక్ష్మి వ్యవహరించారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ పరిశీలించారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: మండలం పరిధిలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ వి.ఖాదార్‌బాబు తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో 456 మంది విద్యార్థులకు 394 మంది పరీక్షలకు హాజరయ్యారు.

నిడదవోలు, సమిశ్రగూడెంలో..

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలు రవీంద్రభారతి ప్రైవేట్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 189 మందికి 174 మంది పరీక్ష రాసారు. మునిసిపల్ హైస్కూల్లో-3లో 200 మందికి 196, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 189 మందికి 178, జెడ్పీ బాలికల హైస్కూల్లో 221 మందికి 199, నారాయణ ప్రైవేట్ స్కూల్లో 220 మందికి 219 మంది, సమిశ్రగూడెం జెడ్పీ హైస్కూల్లో 97 మందికి 94, తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్లో 170 మందికి 155, పురుషోత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో 160 మందికి 140, కోరుమామిడి జెడ్పీ హైస్కూల్లో 158 మందికి 141 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

903 మంది విద్యార్థులకి 845 మంది హాజరు

పెరవలి: పెరవలి మండలంలో గతంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు మూడు సెంటర్లు ఏర్పాటు చేయగా ఈ ఏడాది కొత్తగా ముక్కామల, కానూరు-2ను ఎంపిక చేశారు. ఖండవల్లి, కాకరపర్రు, కానూరు, ముక్కామల, కానూరు-2 గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో సోమవారం నిర్వహించిన పరీక్షలకు 903 మందికి 845 పరీక్షకు హాజరుకాగా 58 మంది గైర్హాజరయ్యారు.

పదో తరగతి పరీక్షకి 75 మంది విద్యార్థులు గైర్హాజరు

కొవ్వూరు: మండలంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి తెలుగు పరీక్షకి 75 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో జె.కెంపురత్నం తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ హైస్కూల్లో 217 మంది విద్యార్థులకు 210 మంది హాజరయ్యారు. బాలికల హైస్కూల్లో 116 మందికి 106 మంది, పీఎంఎం హైస్కూల్లో 190 మందికి 175 మంది హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 180 మందికి 176 మంది, వేములూరు దీప్తి స్కూల్లో 146 మందికి 137 మంది, వాడపల్లి హైస్కూల్లో 228 మందికి 213 మంది, ఐ.పంగిడి హైస్కూల్లో 160 మందికి 148 మంది, కుమారదేవం హైస్కూల్లో 128 మందికి 125 మంది హాజరయ్యారు.

ప్రశాంతంగా తొలి రోజు పరీక్ష

ఉండ్రాజవరం: మండలంలో 10వ తరగతి తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్.సక్సేనా రాజు సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం ఐదు పరీక్ష సెంటర్లల్లో 1,102 మంది విద్యార్థులకు 1,055 మంది తొలిరోజు పరీక్షకు హాజరైనట్లు ఆయన తెలిపారు. 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు.

ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలి



సమావేశం మాట్లాడుతున్న ఆర్వో వెంకటరమణ నాయక్

నిడదవోలు: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని నిడదవోలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ నాయక్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏఈఆర్వో, ఏఈవో, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ, వీఎస్టీ, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, జెండాలు, బోర్డులు, గోడలపై ప్రచారాలు పూర్తిగా నిషేధమన్నారు. రాజకీయ నాయకులకు సంబంధించిన విగ్రహాలు కప్పివేస్తామన్నారు. దీనికి కేటాయించిన బృందాలు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ప్రచారాలకు అనుమతి లేదని, ప్రైవేట్ సంస్థల్లో ఏర్పాటు చేసుకోవాలనుకుంటే సంబంధిత భవన యజమాని రాతపూర్వక అనుమతితో మాత్రమే ప్రచారం చేసుకోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ర్యాలీలు సభ నిర్వహించాలనుకుంటే ముందుగా ఆర్వో నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా సభలు సమావేశాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్వో కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా పాటిస్తూ మే 13న నిర్వహించనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడంలో సంబంధిత నోడల్ అధికారులు ప్రత్యేక బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు సందర్భంగా ఎవరైనా మద్యం, డబ్బు, ఇతర వస్తువుల పంపకాలు జరిగితే అనుసరించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, నిడదవోలు సీఐ కె. వెంకటేశ్వరరావు, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల తహసీల్దార్లు వి. నాగభూషణం, కె. నవీన్‌బాబు, డి. సుధ, నిడదవోలు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు కేవీ శ్రీనివాసరావు, ఆర్ఐ సత్యేంద్రకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్‌గా గురుదత్త ప్రసాద్



గురుదత్త ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్‌గా మేడా గురుదత్త ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఈనెల 16వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఐక్యరాజ్య సమితి అవార్డు పొందిన మేడా గురుదత్ ప్రసాద్ జనసేన పార్టీలో రాజానగరం నియోజకవర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించి ఇటీవల ఆ పార్టీతో విభేదించి వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అదేవిధంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కూడా గురుదత్త ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

వైటీసీ శిక్షణ కార్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: వివిధ విభాగాల ద్వారా నిర్వర్తించే ఎన్నికల విధుల కోసం స్థానిక వైటీసీ ప్రాంగణంలో చేసిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం వైటీసీ శిక్షణ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 విభాగాల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఆ మేరకు అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి విధులను నిర్వర్తించడం కోసం తాత్కాలికంగా ఆయా విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విధులను నిర్వర్తించడం కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలను చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలో వున్న వైటీసీ కేంద్రం వద్ద అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిబాబా, తహసీల్దార్ అప్పారావు, వి.రమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒనువులమ్మకు ఘనంగా పూజలు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తికి మహిళా భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామంలో వేద పండితుల సమక్షంలో, మేళతాళలతో మహిళలు కలశాలతో గ్రామ పుర వీధులలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమ పూజ, అమ్మవారికి లక్ష పుష్పాలతో అర్చన చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళ భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన



పుల్లలపాడులో కేక్ కట్‌చేసి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన నాయకులు, కార్యకర్తలు

నల్లజర్ల: ఫ్యాను గుర్తుకు ఓటేస్తే అభివృద్ధి, సంక్షేమానికి చోటు కల్పించిన వారవుతారని పుల్లలపాడులో సోమవారం స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తానేటి వనిత అభ్యర్థితత్వం ఖారైన తర్వాత ఆ గ్రామ సర్పంచ్ డాక్టరు అల్లూరు సూర్య చంద్రరావు ఇంటి వద్ద సంబరాలు నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పథకాల లబ్ధిదారులంతా ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వనితమ్మను, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. 2014లో చంద్రబాబుకు అధికారం ఇస్తే ప్రజలను ఏవిధంగా మోసం చేసాడో ఇంటింటా వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఐదేళ్లలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుంటూ పేదల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన సీఎం జగనన్న పాలన తీరును విశదీకరించారు. ఈ కార్యక్రమంలో బుడుపుల బాజ్జి, తాడిగడప సుధీర్, కొక్కిరపాటి వెంకట్రావు, మట్టా నరేష్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలతో టెడ్‌లెన్స్ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆర్ట్స్ కళాశాల, టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ ప్రతినిధులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలపై టెడ్‌లెన్స్ సీఈఓ రామదేవ్ రామ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు సోమవారం కళాశాలలో సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం టెడ్‌లెన్స్ సంస్థ కళాశాలలో సెంటర్ ఫర్ టెక్నికల్ ఎక్సలెన్స్ స్థాపించి, విద్యార్థులకు వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధనకు శిక్షణ ఇస్తుంది. దీంతోపాటు స్టార్టప్ కంపెనీల స్థాపనకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించాలి. విద్యార్థులు మంచి ఉద్యోగాలు పొందేలా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఈ ఒప్పందం తోడ్పడుతుంది. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సునీల్ కుమార్ దువ్వూరి పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో సింగిల్ మేజర్ వ్యవస్థపై శిక్షణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నోడల్ రిసోర్స్ విభాగంలో డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2023 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశపెట్టామని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ సింగిల్ మేజర్‌పై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రతిమ, కాకినాడ ఏఎస్‌డీ కళాశాలకు చెందిన శిరీష రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.సంజీవ్‌కుమార్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియంలో ‘ఎగ్జిబిషన్’

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): లేపాక్షి ఎంపోరియంలో మంగళవారం నుంచి 23వ తేదీ వరకూ థీమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో నేరుగా తయారీదారులు చేసిన హస్తకళలను వారే అమ్ముకుంటారన్నారు. వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లేదర్ పప్పెట్, కళంకారి వస్తువులు తయారు చేసే వారు లేపాక్షి షోరూమ్‌లో తమ వస్తువులను విక్రయించుకుంటారని తెలిపారు. ఇక్కడ 10 శాతం నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ లభిస్తుందని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక తెలిపారు.